సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 19 । డిసెంబర్ । 2024



వెంటనే సమస్యలు పరిష్కరించాలి

గ్రీవెన్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆదేశించారు. 8లో



ఆలయ రహదారికి శంకుస్థాపన


ముంచంగిపుట్టులో నిర్మించనున్న ఆలయానికి రహదారి సౌకర్యం కల్పిస్తున్నామని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర అన్నారు. 8లో



క్రీస్తు బోధనలు ఆచరణీయం

క్రీస్తు బోధనలు ఆచరణీయమని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. 8లో

- కూటమి ప్రభుత్వంలో నిలిచిన గ్రామసచివాలయాల భవన నిర్మాణం
- 349లో 229 చోట్ల భవనాలు పూర్తి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- మిగతా 120 పూర్తి చేయడంపై దృష్టి పెట్టని రాష్ట్ర సర్కారు
- పంచాయతీ పాత భవనాల్లో నిర్వహణ
- సౌకర్యాలు లేక సిబ్బంది, ప్రజలకు ఇబ్బంది



డుంబ్రిగుడ మండలంలో అసంపూర్తిగా కించుమండ గ్రామ సచివాలయ భవనం

ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన గ్రామసచివాలయ వ్యవస్థపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యమిచ్చింది. అన్నింటికి పక్కా భవన నిర్మాణాలు చేపట్టింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత వీటి భవన నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నిధులున్నా వీటిపై దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వసతిపై నిర్లక్ష్యం..
ఆదర్శ వ్యవస్థకు శాపం

సాక్షి,పాడేరు: ప్రభుత్వం అందించే పౌరసేవలను గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో తెచ్చే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో 349 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసింది. వీటికి గాను ఒక్కొక్క భవనానికి రూ.43.60 లక్షలు కేటాయించింది. ఈ నిధులతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు 229 సచివాలయ భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా 120 భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి వీటి నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఇవన్నీ శ్లాబ్ స్థాయికి చేరుకుని అసంపూర్తిగా ఉన్నాయి. నిధులు పుష్కలంగా అందుబాటులో ఉన్నా పనులు జరగకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ఆరు నెలల నుంచి సంబంధిత కాంట్రాక్టర్లు వీటి నిర్మాణాల జోలికి వెళ్లడం లేదు. భవన వసతి లేక గ్రామసచివాలయ ఉద్యోగులు, గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. పక్కా భవనాలు లేకపోవడంతో పాత పంచాయతీ కార్యాలయాలు, అద్దె ఇళ్లలో నిర్వహిస్తున్నారు.

- పాడేరు మండలం దేవాపురంలో గ్రామ సచివాలయ భవన నిర్మాణం శ్లాబ్ దశలో నిలిచి పోయింది. శాశ్వత భవనం లేక ఇక్కడ పాత పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ సచివాలయంలో 22 గ్రామాల ప్రజలు సేవలు పొందుతున్నారు.
- హుకుంపేట మండలంలోని పాతకోట, సంతారి గ్రామాల్లో శ్లాబ్ వరకు భవనాలు పూర్తయ్యాయి. ఇక్కడ కూడా పాత పంచాయతీ భవనాల్లో గ్రామసచివాలయాలు నిర్వహిస్తున్నారు.
- డుంబ్రిగుడ మండలంలోని కితలంగి, కొర్రాయి, కంద్రూం, కించుమండ, తూటంగి, అరమ ప్రాంతాల్లో భవన నిర్మాణాలు శ్లాబ్ దశలోనే నిలిచిపోయాయి. ఇక్కడ కూడా పాత పంచాయతీ భవనాలే దిక్కయ్యాయి.

పట్టించుకోని ప్రభుత్వం



కించుమండ గ్రామ సచివాలయ భవన నిర్మాణాన్ని గత ప్రభుత్వం 80 శాతం పూర్తి చేసింది.ఎన్నికలు తరువాత కొత్త ప్రభుత్వం ఈ భవన నిర్మాణాన్ని కనీసం పట్టించుకోలేదు. పాత పంచాయతీ భవనంలో గ్రామ సచివాలయం నిర్వహిస్తున్నారు. భవన వసతి లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

– హెచ్‌టీ రామునాయుడు, కించుమండ, డుంబ్రిగుడ మండలం

పాత భవనమే దిక్కు



మారుమూల దేవాపురంలో గ్రామసచివాలయం భవన నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో పాత పంచాయతీ భవనమే దిక్కయింది. ఈ సచివాలయానికి 22 గ్రామాల గిరిజనులు సేవలు పొందేందుకు వస్తుంటారు. గ్రామసచివాలయ భవన నిర్మాణం పూర్తి చేయాలని పలుసార్లు అధికారులను కోరినా ఫలితం లేదు.

– కిల్లు పరమేశ్వరి, సర్పంచ్, దేవాపురం, పాడేరు మండలం

పూర్తి చేసేందుకు కృషి



జిల్లాలోని గ్రామ సచివాలయాల భవన నిర్మాణాల పెండింగ్ పనులన్నింటిని పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. దీనిలో భాగంగా అన్ని మండలాల ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలిస్తాం. త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్, పాడేరు

గిరిజన మ్యూజియం అద్భుతం





గిరి మహిళ చీరకట్టుతో.. గిరిజన మ్యూజియం వద్ద అధికారులతో ఒడిశా డిప్యూటీ సీఎం ప్రవతి పరిడా

- ఒకేలా గిరిజనుల ఆచార వ్యవహారాలు
- కాఫీ రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటాం
- ఒడిశా డిప్యూటీ సీఎం ప్రవతి పరిడా
- గిరిగ్రామ దర్శిని సందర్శన
- గిరి మహిళల చీరకట్టుతో సందడి



సుంకరమెట్ట కాఫీ ప్లాంటేషన్ వద్ద గిరి మహిళలతో ఒడిశా డిప్యూటీ సీఎం ప్రవతి పరిడా

అరకులోయ టౌన్ : గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రతిమలతో ఏర్పాటుచేసిన గిరిజన మ్యూజియం అద్భుతమని ఒడిశా డిప్యూటీ సీఎం ప్రవతి పరిడా పేర్కొన్నారు. ఒడిశాలో పర్యాటకరంగ అభివృద్ధిపై అధ్యయనం చేసేందుకు బుధవారం ఆమె ప్రత్యేక హెలికాప్టర్‌లో అరకులోయ విచ్చేశారు. పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించిన ఆమె ఎంతో అద్భుతంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అరకులోయ ప్రాంత గిరిజనుల సంప్రదాయం, ఆచార వ్యవహారాలు, ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలోని గిరిజనుల ఆచార వ్యవహారాలు ఒకేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఇక్కడి మాదిరిగానే తమ రాష్ట్రంలోని కాఫీ రైతులకు సహాయ సహకారాలు అందించి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుంకరమెట్ట కాఫీ ప్లాంటేషన్‌ను పరిశీలించారు.అక్కడ ఏర్పాటు చేసిన కెనోపీ వాక్ బ్రిడ్జిను తిలకించిన ఆమె అటవీ సిబ్బందిని అభినందించారు. అరకులోయలోని కాఫీ మ్యూజియాన్ని సందర్శించారు. అరకు కాఫీ రుచి చూశారు. గిరిజన మ్యూజియాన్ని తిలకించారు. ఇక్కడి గిరిజనుల సంప్రదాయ ప్రతిమలతోపాటు గిరి మహిళలు థింసా నృత్యం చేస్తున్నట్టుగా ఉన్న ప్రతిమ వద్ద ఫొటో తీసుకున్నారు. అనంతరం పెదలబుడు పంచాయతీలోని గిరిగ్రామ దర్శినిని సందర్శించారు. ఆమెకు గిరి మహిళలు థింసా నృత్యంతో స్వాగతం పలికారు. వారితో కలిసి నృత్యం చేశారు. అనంతరం గిరి మహిళల చీరకట్టుతో సందడి చేశారు. గిరిజనుల ఆచార వ్యవహారాలు ప్రతిబింబించేలా ఏర్పాటుచేసిన ఇళ్లను తిలకించారు. కోరాపుట్ కలెక్టర్ కీర్తి వాసన్, ఎస్పీ రోహిత్ వర్మ, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, జేసీ అభిషేక్ గౌడ పాల్గొన్నారు. పాడేరు డీఎస్పీ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో సీఐ ఎల్.హిమగిరి బందోబస్తు నిర్వహించారు.

విశాఖ రేంజ్ డీఐజీ ఆకస్మిక పర్యటన

చింతపల్లి: విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి బుధవారం చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఆకస్మికంగా పర్యటించారు. దీనిలో భాగంగా చింతపల్లి, జీకేవీధి పోలీసుస్టేషన్లతోపాటు పెదవలస ఆర్మ్‌డ్ అవుట్ పోస్టును ఆయన పరిశీలించారు. ఏజెన్సీలో ప్రధానంగా గంజాయి సాగు, రవాణా పూర్తిస్థాయిలో నిరోధంపై పోలీసు అధికారులతో చర్చించారు. వారికి పలు సూచనలు చేసినట్లు తెలిసింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో ఆయన పర్యటనను గోప్యంగా ఉంచారు. ఆయన వెంట ఎస్పీ అమిత్ బర్దర్, చింతపల్లి డీఎస్పీ షేక్ షహబాజ్ అహ్మద్, చింతపల్లి, జీకేవీధి సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

న్యూస్‌రీల్

ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : జన్‌మన్ పథకంలో జిల్లావ్యాప్తంగా కొత్తగా మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళ అభ్యర్థులు టెన్త్ ఉత్తీర్ణత పొంది స్థానికంగా నివాసం ఉండి వివాహిత అయి ఉండాలన్నారు. 2024 జూలై 1 నాటికి వారు 21 సంవత్సరాలు పూర్తి చేసి 35 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలన్నారు. 21 సంవత్సరాల మహిళ అభ్యర్థులు లభ్యం కాకపోతే 18 ఏళ్లు పూర్తయిన వారిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అర్హత ఉన్న మహిళ అభ్యర్థులు ఈనెల 20 నుంచి డిసెంబర్ 31 వ సాయంత్రం 5గంటలోగా సంబంధిత మహిళ శిశు సంరక్షణ అధికారికి నేరుగా లేదా పోస్ట్ ద్వారా దరఖాస్తులను అందజేయాలని సూచించారు. అర్హత, మార్కుల ఆధా రంగానే ఎంపికలు పారదర్శకంగా జరుగుతాయన్నారు. దళారులు నమ్మి మోసపోవద్దని సూచించారు. పూర్తి వివరాలకు సమీపంలో ఉన్న ఐసీడీఎస్ కేంద్రాల్లో సంప్రదించాలని ఆమె కోరారు.

కాఫీ పండ్లను దళారులకు అమ్మొద్దు

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



కాఫీ పండ్లను పరిశీలిస్తున్న పీవో అభిషేక్

చింతపల్లి : కాఫీ పండ్లను దళారులకు అమ్ముకుని నష్టపోవద్దని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. బుధవారం ఆయన గాదిగొయ్య ప్రాంతంలో కాఫీ తోటల్లో పండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాఫీ పండ్లను మ్యాక్స్ సంస్థకు విక్రయించాలని కాఫీ రైతులకు సూచించారు. అలాకాకుండా దళారులకు అమ్మడం వల్ల తూనికల్లో తేడాల వల్ల పూర్తినష్టపోతారన్నారు. పక్వానికి వచ్చిన కాఫీని సేకరించడం వల్ల మంచి ధర పొందవచ్చన్నారు. రైతులకు లాభాలు వస్తాయని, అలాగే మంచి ధర వస్తుందన్నారు. రైతుల నుండి వివరాలు మిరియం, కాఫీ వల్ల ఆదాయ వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ప్రభాకర్, వెంకటేశ్వర్రావు, ఏఈవో అప్పలనాయుడు, కాఫీ ఫీల్డు అధికారులు పాల్గొన్నారు.

మ్యూజియం నిర్మాణానికి కొత్త టెండర్లు

గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదాభార్గవి



విలేకరులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ సంచాలకులు సదాభార్గవి

చింతపల్లి: గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణం ఉండాలని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదాభార్గవి తెలిపారు. బుధవారం తాజంగిలో నిర్మిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియాన్ని పరిశీలించారు. నిర్మాణంలో జాప్యంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులకు కొత్త టెండర్లు నిర్వహించి వేగంగా జరిగేలా ఇంజినీరింగ్ అధికారులకు అప్పగిస్తామన్నారు. వచ్చే జనవరి 8వ తేదీ నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు. అదేనెల 16వ తేదీనుంచి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీటిని మూడు విభాగాలుగా విభజించి ఏకకాలంలో జరిగేలా నిర్ణయం తీసుకుంటున్నట్టు ఆమె వెల్లడించారు. విద్యుత్ దీపాలు, సుందరీకరణ పనులను ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అభిషేక్, ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ డైరెక్టర్లు వీఎస్ ప్రభాకర్, వెంకటేశ్వర్రావు, టీఆర్ఎంఈడీ మందారాణి, డేవిడ్, ఎ.శ్రీనివాస్, కిషోర్, ట్రైకార్ అసిస్టెంట్ సీతారామ్ పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ డిమాండ్
- పాడేరులో గురుకులం ఎదట నిరసన



పాడేరులో ఆందోళన చేస్తున్న విద్యార్థినులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు

పాడేరు: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం వీటి ఆధ్వర్యంలో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు స్థానిక గరుకులం పాఠశాల, కళాశాల విద్యా సంస్థల వద్ద ఆందోళనలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు రాజశేఖర్, జీవన్‌కృష్ణ వేర్వేరుగా మాట్లాడారు. వీరి సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వల్ల గిరిజన విద్యార్థుల చదువులు నిర్వీర్యం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాడేరు కేంద్రంగా నేటికి 33రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్న కూటమి ప్రభుత్వం నిమ్మ కు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందన్నారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు చేస్తోందన్నారు. దీనివల్ల పాఠశాలలు, కళాశాలల్లో విద్యా ప్రమాణాలు కుంటుపడుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కార్తీక్, కృష్ణారావు, లక్ష్మణ్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

21న డిప్యూటీ సీఎం పర్యటన

పగడ్బందీగా ఏర్పాట్లు: కలెక్టర్ దినేష్‌కుమార్



అరకులోయ టౌన్: డిప్యూటీ సీఎం కె.పవన్ కల్యాణ్ ఈనెల 21న అనంతగిరి మండలంలో పర్యటిస్తున్నారని, ఇందుకు సంబంధించి పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఆయన పర్యటన పురస్కరించుకుని బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పినకోట పంచాయతీ గుమ్మంతి వద్ద సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ పరిధిలో రూ.17 కోట్లతో నిర్మించిన ఏడు రహదారులను ఆయన ప్రారంభిస్తారన్నారు. వీటివల్ల పినకోట పంచాయతీలో 18 హేబిటేషన్లు రవాణా సదుపాయం అదుబాటులోకి వస్తుందన్నారు. గొమ్మంతి, బల్లగరువు, దిబ్బపాలెం, రెడ్డిపాలెం, మల్లంపేట గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు, వైద్య సదుపాయాల వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. గ్రామాలలో జలజీవన్ పథకం కింద నిర్మించిన అన్ని తాగునీటి పథకాలు పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించారు. అనంతరం గుమ్మంతి గ్రామాన్ని సందర్శించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ, పీఆర్ ఈఈలు కె. వేణుగోపాల్, కొండయ్యపడాల్, పీఐయూ ఈఈ శ్రీనివాస్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమేష్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌బీఎస్ నంద్, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ మురళి, డీపీవో లవరాజు, డీఎల్పీవో పీఎస్. కుమార్, అరకు, అనంతగిరి సీడీపీవోలు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గిరి రైతుల్లో వాన గుబులు

- చిరుజల్లులతో ఆందోళన
- సురక్షిత ప్రాంతాలకు పంట ఉత్పత్తులు తరలింపు



పాడేరు-హుకుంపేట రోడ్డులో ప్లాస్టిక్ కవర్లు కప్పిన వరి కుప్పలు



కొంతిలి ప్రాంతంలో వరిపనలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న గిరిజన రైతులు



పాడేరు ప్రాంతంలో ముసురు వాతవరణం

సాక్షి,పాడేరు: వాయుగుండం కారణంగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు గిరి రైతుల్లో గుబులు రేపుతున్నాయి. మంగళవారం రాత్రి నుంచి వాతావరణం ఒక్కసారిగా మారింది. బుధవారం ఉదయం నుంచి మబ్బు వాతావరణం నెలకొంది. పాడేరు పరిసర ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి. ఇప్పటివరకు 70 శాతం మేర వరి కోతలు పూర్తయ్యాయి. మిగత 30 శాతం పంటను కోయాల్సి ఉంది. అక్కడక్కడ వరి పనలు పొలాల్లోనే ఉన్నాయి. వీటిని ఒడ్డుకు చేర్చి కాపాడుకునే పనుల్లో గిరి రైతులు నిమగ్నమయ్యారు. సురక్షిత ప్రాంతాలకు తరలించి కుప్పలు వేసి టార్పాలిన్లు కప్పుతున్నారు. పంట కోయని భూముల్లో నీరు పోయేలా కాల్వలు తీసుకున్నారు. చిరుధాన్యాలు, రాజ్‌మా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి నందు రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరికోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. దిగుబడి దశలో ఉన్న రాజ్‌మా పంటను సేకరించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు.

మన్యంలో పెరిగిన ఉష్ణోగ్రతలు

అల్పపీడనం ప్రభావంతో మన్యంలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. మబ్బు వాతావరణం నెలకొనడంతో చలిగాలులు తీవ్రత కాస్త తగ్గింది. బుధవారం అరకులోయ కేంద్ర కాఫీ బోర్డు వద్ద 17.2, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 16, చింతపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో 16.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

టెన్త్ హాల్ టికెట్లలో తప్పులుంటే సరిచేయండి

- డీఈవో బ్రహ్మాజీరావు ఆదేశం

పాడేరు: టెన్త్ హాల్ టికెట్లలో ఏమైనా తప్పులు ఉంటే వెంటనే మార్పులు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు బుధవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. 2024-25 విద్యాసంవత్సరంలో టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థుల తండ్రి, పేరు, పుట్టిన తేదీ, పుటుమచ్చలు, ఫొటో, సంతకాల్లో ఏమైన తప్పులు ఉంటే సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను సంబంధిత హెచ్ఎంలు, సిబ్బంది పరిశీలించి తేడాలుంటే వెంటనే సరిచేయాలని ఆదేశించారు.

అవుట్ సోర్సింగ్ టీచర్ల ధర్నా

- సర్వీసు ఆధారంగా రెగ్యులర్ చేయాలని డిమాండ్

కూనవరం: సర్వీసు ఆధారంగా రెగ్యూలర్ చేయాలని ఏపీఆర్ టీడబ్ల్యూఎస్ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, ఆధ్యాపకులు డిమాండ్ చేశారు. బుధవారం కోతులగుట్ట ఏపీఆర్ గురుకులం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన సమస్యలు పరిష్కారానికి గత 33 రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సర్వీసును పరిగణనలోకి తీసుకొని రెగ్యులర్ చేయాలని, లేదా కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా (సీఆర్‌టీలుగా) అయినా మార్పుచేయాలని కోరారు.

ఇళ్ల విలువ అంచనాలో తేడాలుంటే మళ్లీ సర్వే

చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్



పోలవరం నిర్వాసితులతో మాట్లాడుతున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

కూనవరం: పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపు నిర్వాసితులు అధైర్యపడవద్దని, ఇళ్ల విలువ అంచనాల్లో తేడా ఉంటే వాటికి మళ్లీ సర్వే చేస్తారని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన మండలంలో పర్యటించారు. కాచవరం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడారు. టీచర్ల కొరత సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనతరం కూనవరం పంచాయతీ సమీపంలో పోలవరం ముంపునకు గురవుతున్న ఇళ్లకు సంబంధించి స్ట్రక్చర్ వ్యాల్యూను పీవో పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. స్ట్రక్చర్ విలువపై అనుమానాలు ఉంటే మళ్లీ సర్వే చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సందర్శించి, పరిసరాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. చింతూరు ఎస్‌డీసీ అంబేడ్కర్, డీఈఈ పీఆర్ రవితేజ, పంచాయతీ కార్యదర్శి శివ మణికంఠ, ఎంఈవో లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం: మైదాన ప్రాంతంలో, సబ్ ప్లాన్ ఏరియాల్లోని గిరిజనుల ఆర్థికాభివృద్ధికి అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. పీవో తన చాంబర్‌లో బుధవారం గిరిజన సంక్షేమశాఖ అధికారులు, వెలుగు ఏపీడీ తదితరులతో వన్‌ధన్ వికాస కేంద్రాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదాన ప్రాంతం, సబ్‌ప్లాన్ ఏరియా గిరిజనులకు సంబంధించిన ఆధార్ కార్డులతో జాబితా తయారు చేసి సమర్పించాలని సూచించారు.అక్కడ గిరిజనులకు వన్‌ధన్ వికాస కేంద్రాల ద్వారా మినీ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. జీడిపిక్కలు యూనిట్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వన్‌ధన్ వికాస కేంద్రాల ద్వారా 300 మందిని ఒక గ్రూపుగా ఏర్పాటు చేస్తామన్నారు. వెలుగు డీపీఎం పరమేశ్వరరావు నోడల్ అధికారిగా నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ విజయశాంతి, ఏపీడీ దేగలయ్య, ఏటీడబ్ల్యూవో రామతులసి, కృష్ణమోహన్, నాగజ్యోతి, డీపీఎం అపర్ణ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ రహదారికి శంకుస్థాపన

- నిర్మాణ పనులను ప్రారంభించిన ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో త్వరలో జరగనున్న శ్రీవరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించి ముందుగా రహదారి సౌకర్యం కల్పిస్తున్నామని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ సెల్లుం గ్రామ సమీపంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 10లక్షలతో రెండు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కొండపైకి రహదారి నిర్మించిన వెంటనే వేగంగా పనులు మొదలు అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, నరసింహస్వామి, మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

గురుకుల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు

రంపచోడవరం: మండల కేంద్రంలో గురుకుల పాఠశాలలో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు చేస్తున్న ధర్నా బుధవారం నాటికి 33వ రోజుకు చేరుకుంది. యూటీఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఇందులో భాగంగా ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు రంపచోడవరం పురవీధుల్లో భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమకు చాలీచాలని జీతాలు ఇస్తున్నారని, కూటమి ప్రభుత్వం తమకు అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2022 పీఆర్‌సీ ప్రకారం జీతాలు చెల్లించాలని, 2024 డీఎస్సీలో తమ పోస్టులను మినహాయించి , ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.నిరసన కార్యక్రమానికి సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఏసుపాదం తదితరులు

ముంచంగిపుట్టు: క్రీస్తు బోధనలు ఆచరణీయమని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర సహకారంతో ముంచంగిపుట్టు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు, అంతర్జాతీయ ముఖ్య ప్రసంగికులు ఏసుపాదం ఈ వేడుకల్లో పాల్గొని వాక్యోపదేశం చేశారు. యేసు నడిపిన సన్మార్గంలోనే ప్రజలు నడవాలని, శాంతి, సహనం కలిగి జీవించాలని సందేశాన్ని అందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ లోక రక్షకుడు, కరుణామయుడైన ఏసు గొప్ప సందేశాలను మానవాళికి అందించారన్నారు. ఆయన మార్గం అనుసరణీయమన్నారు. దేవుని సేవకులు గిరిజనులను చైతన్యం పరుచుటకు చేస్తున్న కృషిని కొనియాడారు.అనంతరం జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ మండలంలో పాస్టర్ ఫెలోషిప్ సంఘం ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించినట్టు చెప్పారు. ముఖ్యంగా మారుమూల గిరిజన గ్రామాల్లో పాస్టర్లు చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. అంతర్జాతీయ ప్రసంగీకులు ఏసుపాదం అందించిన తోడ్పాటు మరువలేనిదన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. అతిథులు అందరిని జెడ్పీ చైర్ పర్సన్ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, ఎంపీపీ అరిసెల సీతమ్మ, హుకుంపేట మాజీ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంగడ రమేష్, డాక్టర్ తమర్బ నరసింగరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి అరబీరు జగబంధు, మండల పార్టీ అధ్యక్షులు పాంగి పద్మారావు, పాస్టర్లు మోహన్‌రావు, సురేష్, బర్నబాస్, జాన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి



అవగాహన కల్పిస్తున్న పీడీ సూర్యలక్ష్మి, వేదికపై సీడీపీవో రూన్సీరాణి, ఎంపీడీవో డేవిడ్‌రాజు

పాడేరురూరల్(అరకులోయరూరల్): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు అందించాలని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి చెప్పారు. పాడేరులోని మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి శిక్షణ తరగతులకు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్త్, వెలుగు, సచివాలయం మహిళ పోలీసులకు ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలను మెరుగుపరిచేందుకు అందరూ సమన్వయంగా పనిచేయాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఎంపీడీవో డేవిడ్‌రాజు మాట్లాడుతు గ్రామ స్థాయిలో సేవ భావంతో ఉద్యోగులందరూ పనిచేయాలన్నారు. సీడీపీవో రూన్సీరాణి, సూపర్‌వైజర్ లక్ష్మి, సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

నైట్ సర్వీసు రద్దుతో ప్రయాణికుల అవస్థలు



రద్దు చేసిన నైట్ సర్వీస్ బస్సు



బస్సులో కిక్కిరిసిన ప్రయాణికులు

సీలేరు: విశాఖపట్నం నుంచి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లేందుకు ఆర్టీసీ అధికారులు రోజూ సాయంత్రం 6.30 గంటలకు, 7.30గంటలకు నైట్ సర్వీసులు ఉండేవి. అయితే ఇటీవల మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో నైట్ సర్వీసులను రద్దు చేశారు. దీంతో ఒక్క బస్సు మాత్రమే ఈ రూట్‌లో నడుపుతున్నారు. బస్సులో ప్రయాణికులు కిక్కిరిసి ఉంటున్నారు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదని, మరో బస్సు ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయంపై విశాఖ డిపో మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సీలేరు మీదుగా భద్రాచలం మధ్య రహదారులు అధ్వానంగా ఉండడంతో గతంలో ఈ రూట్‌లో నడిపిన బస్సు మరమ్మతుకు గురైందని, మరో బస్సు సర్వీసు కొనసాగిస్తున్నామని, త్వరలో పాడైన బస్సును రిపేర్ చేసి అందుబాటులో తీసుకొస్తామన్నారు. సీలేరు మీదుగా నడిచే రెండు నైట్ సర్వీసులను, సీలేరు నైట్‌హాల్ట్ ను పునరుద్ధరిస్తామని, రోడ్లు బాగైతే మరిన్ని సర్వీసులు నడపడానికి ఆలోచిస్తున్నామన్నారు.

విద్యుత్ ఆదాపై అవగాహన అవసరం



పాడేరులో వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న డీఈ అప్పారావు



చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది, విద్యార్థులు

పాడేరురూరల్(అరకులోయ రూరల్): విద్యుత్ ఆదాతోనే మరింత విద్యుత్ సేవలు మెరుగుపడుతుందని విద్యుత్ శాఖ డీఈ ఎ.వి.ఎన్.ఎం.అప్పారావు తెలిపారు. జాతీయ ఇందన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మండలంలో కాడేలి అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్ వినియోగదారులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు వృథా కాకుండా విద్యుత్ పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ నియోగించడంలో అవగాహన కలిగి ఉంటేనే విద్యుత్ సేవలు మరింత మెరుగుపడతాయన్నారు.విద్యుత్ శాఖ ఏడీఈ ఆనందమురళి, ఏఈ రమణ, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చింతపల్లి: విద్యుత్ ఆదాతో ఆర్థికంగా సౌలభ్యం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ కోట్ల సన్నిరాంబాబు అన్నారు. జాతీయ ఇందన పొదుపు వారోత్సవాల్లో భాగంగా చింతపల్లి వారపు సంతలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం విద్యుత్ శాఖ ఏడీఈ సన్ని రాంబాబు మాట్లాడుతూ వినియోగదారులు విద్యుత్ వృథాని అరికట్టాలన్నారు."ఎల్ఈడీ బల్బులు వాడకం ద్వారా కరెంటు బిల్లులు తగ్గడమే కాకుండా కాలుష్య నివారణ జరుగుతుందన్నారు. విద్యుత్ శాఖ చింతపల్లి, కొయ్యూరు, జి .మాడుగుల ఏఈఈలు ప్రభాకరరావు, నాగేశ్వరరావు, రమణ, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం సాగిన రామరాజు పడాల్, విద్యుత్ సిబ్బంది. విద్యార్థులు పాల్గొన్నారు.

వెంటనే సమస్యలు పరిష్కరించాలి

చింతూరు: గ్రీవెన్సులో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్సు కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన 27 దరఖాస్తులను పరిశీలించిన ఆయన వాటిని వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

మోతుగూడెం: పొల్లూరు పవర్ హౌస్ వద్ద ఉన్న అటకేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విఘ్నేశ్వర పూజ, పుణ్యా వచనము, రుద్రాభిషేకం, బిల్వార్చన, పూజమహోత్సవం చేశారు. పొల్లూరు దేవాలయం అర్చకులు కుమారస్వామిశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. విద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు దుస్తులు అందజేశారు. జెన్‌కో అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నదాత అప్రమత్తం



నూర్పిడి అనంతరం వరిని బస్తాల్లో తరలిస్తున్న గిరిజన కుటుంబం



డుంబ్రిగుడలో ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న రైతులు

డుంబ్రిగుడ: బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా మండలంలో బుధవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు కారు మబ్బులు కమ్ముకుని విపరీతంగా చలిగాలు వీచాయి. తుపాను హెచ్చరికల నేపథ్యంలో నూర్పిళ్లు అనంతరం మిగిలి ఉన్న వరిని కల్లాల్లో కుప్పలుగా వేసి టార్పిలిన్లతో భద్రపరుస్తున్నారు. కొంతమంది బస్తాలో వరిని సురక్షిత ప్రాంతాలకు తరలించే పనుల్లో నిమగ్నమై ఉన్నారు. అకాల వర్షాలు పడితే ఇబ్బందులు తప్పడం లేదని గిరిజనులు వాపోతున్నారు.

రాజవొమ్మంగి: బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా భారీ వర్షాలు కురవనున్నాయని, రైతులు వరి పంట కోతలను మూడు రోజుల పాటు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారి చక్రధర్ కోరారు. ఆయన బుధవారం పలు గ్రామాల్లో పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. వరి పంట పనలపై ఉందని, మరి కొన్ని చోట్ల కుప్పలుగా వేశారని వర్షానికి నష్టపోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.



సూరంపాలెంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో చక్రధర్

20న ఆదివాసీ చైతన్య సదస్సు



కాంతారావు

జి.మాడుగుల: భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ అనుసరించి సంక్రమించిన ఆదివాసీ భూచట్టాలు, అమలు చేయాలని, పీసా చట్టం ప్రకారం గ్రామ పంచాయతీ సంపదల సర్వాధికారాలు పంచాయతీలకే ఉండాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న జి.మాడుగులలో నిర్వహించే ఆదివాసీ స్వయం పాలన చైతన్య సదస్సును విజయవంతం చేయాలని దండకారణ్య విమోచన సమితి జిల్లా అధ్యక్షుడు కొండపల్లి కాంతరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. స్వయంపాలన గురించి ప్రతి ఆదివాసీ బిడ్డ తెలుసుకోవాలని, దీనిపై గ్రామ స్థాయిలో చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి అందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి



అఖిల్ వెంకట సాయి (ఫైల్)

చింతపల్లి: కొయ్యూరు మండలం బూదరాళ్ల ఘాట్‌రోడ్డులో ప్రమాదానికి గురైన యువకుడు కాకూరి అఖిల్ వెంకట సాయి(23) మృతి చెందాడు. పర్యాటక ప్రాంతమైన లంబసింగిలో పర్యటించి స్వగ్రామం రాజవొమ్మంగి మండలం శరభవరం తిరుగు ప్రయాణంలో బూదరాళ్ల ఘాట్ రోడ్డులో ఇద్దరు ప్రమాదానికి గురైయ్యారు.ఈ ప్రమాదంలో కాకూరి అఖిల్ వెంకట సాయి, కాకూరి సాయు చంద్రలు గాయ పడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడ్డ అఖిల్ సాయిని ఉన్నత వైద్యానికి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్య సేవలు పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

రెండు మట్టి ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్

ఎటపాక: అక్రమంగా తెలంగాణాకు మట్టి రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను తహసీల్దార్ సుబ్బారావు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. ఎటపాక మండలం పురుషోత్తపట్టణం నుంచి అనుమతులు లేకుండా మట్టిని భద్రాచలానికి చెందిన ట్రాక్టర్లలో తరలిస్తున్నారనే సమాచారంతో నిఘా ఏర్పాటు చేశారు. ఈ మేరకు రాత్రి మట్టితో భద్రాచలం వెళ్తున్న ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు. అదే విధంగా మేడువాయి సమీపంలో నిల్వ చేసిన ఆరు టన్నుల ఇసుకను కూడా సీజ్ చేసినట్లు తెలిపారు.

రెండు కేసుల్లో 34 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులతో పోలీసులు

చోడవరం రూరల్: మరో రాష్ట్రానికి తరలించడానికి 20 కిలోల గంజాయితో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు కోసం ఎదురు చూస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం నుంచి 20 కేజీల గంజాయిని హర్యానా రాష్ట్రానికి తరలించడంలో భాగంగా చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఎదురు చూస్తున్న ఇద్దరిని బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా.. 20 కేజీల గంజాయి బయటపడింది. నిందితులను అరెస్ట్ చేసి, గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

నక్కపల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ నుంచి తమిళనాడు తరలిస్తున్న 14 కిలోల గంజాయిని బుధవారం నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. సీఐ కుమారస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏజెన్సీలోని బొయితిలి నుంచి ముగ్గురు వ్యక్తులు బస్సులో 14 కిలోల గంజాయిని తమిళనాడు తరలిస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు వేంపాడు టోల్ ప్లాజా వద్ద మాటు వేసి తనిఖీలు చేపట్టామని సీఐ తెలిపారు. గంజాయి తరలిస్తున్న తమిళనాడులోని తిరువూరుకు చెందిన పరమశివమ్, తిరుమురుగన్‌లపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో అదుపులోకి తీసుకున్న మరో మైనర్ బాలికను విశాఖలోని జువైనల్ హోమ్‌కి తరలించినట్టు సీఐ తెలిపారు.

విజయ్ హజారే ట్రోఫీకి విశాఖ సిద్ధం

ఈ నెల 21 నుంచి లీగ్ మ్యాచ్‌లు



విశాఖ స్పోర్ట్స్: దేశవాళీ లిస్ట్ ఏ క్రికెట్ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీకి వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. టోర్నీలో భాగంగా మొత్తం 38 జట్లు లీగ్ దశలో పోటీపడనుండగా, గ్రూప్-డీ మ్యాచ్‌లు ఈ నెల 21 నుంచి విశాఖ వేదికగా ప్రారంభం కానున్నాయి. ముంబయ్, నవీ ముంబయ్ వేదికల్లో ఆంధ్ర జట్టు గ్రూప్ బీలో ఆడనుంది. లీగ్ దశలో ఏడు వన్డే మ్యాచ్‌లు వైఎస్సార్ స్టేడియంలో జరగనున్నాయి. గ్రూప్ దశ పోటీలు రౌండ్-రాబిన్ పద్ధతిలో జనవరి 5తో ముగియనుండగా.. ప్లేఆఫ్ మ్యాచ్‌లు జనవరి 9 నుంచి ప్రారంభమవుతాయి. జనవరి 18న ఫైనల్ జరగనుంది.

విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా విశాఖ వేదికగా మొదటి మ్యాచ్ ఈ నెల 21న ఉదయం 9 గంటలకు ఛత్తీస్‌గఢ్, మిజోరం జట్ల మధ్య జరుగుతుంది. ఛత్తీస్‌గఢ్ జట్టుకు అమన్‌దీప్, మిజోరం జట్టుకు జోథన్ సంగా కెప్టెన్‌లుగా వ్యవహరిస్తారు. రెండో మ్యాచ్ ఈ నెల 23న రింకూసింగ్ కెప్టెన్సీలో ఉత్తరప్రదేశ్ జట్టు మిజోరంతో తలపడనుంది. 26న మూడో మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్‌తో సాయికిశోర్ నాయకత్వంలో తమిళనాడు జట్టు ఆడనుంది. 28న నాలుగో మ్యాచ్ కరణ్ నాయర్ కెప్టెన్సీలో విదర్భ జట్టు, మనన్‌వోరా కెప్టెన్సీలో చండీగఢ్ జట్ల మధ్య జరగనుంది. ఈ నెల 31న తమిళనాడుతో విదర్భ, జనవరి 3న ఛత్తీస్‌గఢ్‌తో పరాస్‌డోగ్రా కెప్టెన్సీలో జమ్ముకశ్మీర్ జట్టు ఆడనుంది. లీగ్ చివరి మ్యాచ్ జనవరి 5న జమ్ముకశ్మీర్‌తో చండీగఢ్ తలపడనుంది.

ఈ సారి భరత్ కెప్టెన్సీలో..

ఆంధ్ర జట్టు ఈసారి కె.ఎస్.భరత్ కెప్టెన్సీలో ఆడనుంది. భరత్ వికెట్ల వెనుక నిలబడటంతో పాటు ఓపెనర్‌గా రానున్నాడు. జట్టులోని మరో ముఖ్య ఆటగాడు రికీబుయ్ టాపార్డర్ బ్యాటర్‌గా బరిలోకి దిగనున్నాడు. అశ్విన్ హెబ్బర్ ఓపెనర్‌గా, వైస్ కెప్టెన్ షేక్ రషీద్, పృథ్వీలు టాపార్డర్‌లోనే బ్యాటింగ్‌కు దిగనున్నారు. మిడిలార్డర్‌లో తేజ రానున్నాడు. మీడియం పేస్‌తో శశికాంత్, అఖిల్, మహీప్, సత్యనారాయణ, తపస్వీలు చెలరేగనుండగా, స్పిన్‌తో అభినవ్, అంజనేయులు, సందీప్, కుమార్ బంతిని గింగిరాలు తిప్పనున్నారు. ఆంధ్ర తన తొలి మ్యాచ్‌ను రైల్వేస్‌తో ఆడనుండగా, రాజస్థాన్, సిక్కిం, సర్వీసెస్, మేఘాలయ, మహారాష్ట్రలతో వరసగా మ్యాచ్‌లాడనుంది. లీగ్ చివరి మ్యాచ్‌లో హిమాచల్ ప్రదేశ్‌తో తలపడుతుంది.

కోర్బా ఎక్స్‌ప్రెస్‌కు తాత్కాలిక హాల్ట్

తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖపట్నం-కోర్బా(18517) ఎక్స్‌ప్రెస్, కోర్బా- విశాఖపట్నం (18518) ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 9, 10వ తేదీల్లో చకర్‌బత స్టేషన్‌లో తాత్కాలిక హాల్ట్ కల్పిస్తున్నారు. ఈ ప్రాంతంలో చాలీసా మహోత్సవాల సందర్భంగా తాత్కాలిక హాల్ట్ ఏర్పాటు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు

మారిన కోచ్‌లతో విశాఖ-చెన్నై ఎక్స్‌ప్రెస్

విశాఖపట్నం-చెన్నై సెంట్రల్(22801) ఎక్స్‌ప్రెస్ మార్చి 7 నుంచి, చెన్నై సెంట్రల్-విశాఖపట్నం (22802) ఎక్స్‌ప్రెస్ మార్చి 8 నుంచి మారిన కోచ్‌లతో రాకపోకలు సాగిస్తుందని అధికారులు తెలిపారు. విశాఖపట్నం- పారాదీప్(22810) ఎక్స్‌ప్రెస్ మార్చి 9 నుంచి, పారాదీప్-విశాఖపట్నం (22809) ఎక్స్‌ప్రెస్ మార్చి 10 నుంచి మారిన కోచ్‌లతో నడుస్తుంది. ఈ రైళ్లు ఆయా తేదీల నుంచి జనరేటర్ మోటార్ కార్, సెకండ్ క్లాస్ కం లగేజీ/దివ్యాంగ్, జనరల్ క్లాస్-4, స్లీపర్ క్లాస్-7, థర్డ్ ఏసీ-4, సెకండ్ ఏసీ-2 కోచ్‌లతో నడుస్తాయి.

కొరియర్ ద్వారా గంజాయి రవాణా

- తప్పుడు చిరునామాతో బట్టబయలు
- పారిశ్రామిక ప్రాంతంలో అక్రమ నిల్వలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో అద్దె ఇంట్లో భారీగా గంజాయి నిల్వలను బుధవారం పోలీసులు గుర్తించారు. ఆ ఇంటి నుంచే ఆటో ద్వారా వివిధ ప్రాంతాలకు గంజాయి పంపిణీ చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. వివరాలివీ.. ఇటీవల టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి నుంచి న్యూఢిల్లీకి ఒక కొరియర్ సంస్థ ద్వారా గంజాయి పార్శిల్ పంపారు. అయితే కొరియర్ చేరాల్సిన చిరునామా తప్పుగా ఉండటంతో.. అక్కడి పార్శిల్ బాయ్‌కు అనుమానం వచ్చింది. ఈ విషయాన్ని ఇక్కడి నుంచి పంపిన సంస్థకు తెలియజేసి పార్శిల్‌ను తిరిగి విశాఖ పంపాడు. దీంతో వారు ఈ విషయాన్ని టూ టౌన్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు పార్శిల్ తనిఖీ చేసి అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. కొరియర్ సంస్థకు పార్శిల్ పంపిన వ్యక్తులు ఇచ్చిన చిరునామా(60వ వార్డు పరిధిలోని ఎంఐజీ-1, 22-65-5-22 క్వార్టర్స్)ను పరిశీలించగా.. అది ప్రమోద్‌కు చెందిన పాత ఇంటి చిరునామాగా తేలింది. ప్రమోద్ బిహార్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులకు నెలకు రూ.9వేలకు ఆ ఇంటిని అద్దెకు ఇచ్చినట్లు పోలీసులకు తెలిపాడు. సదరు వ్యక్తులు ఒక ఆటోను అద్దెకు తీసుకుని.. ఆ ఇంట్లో గంజాయి బస్తాలను నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు ఆటో ద్వారా గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మంగళవారం రాత్రి టూ టౌన్ పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి.. 100 కిలోల గంజాయిని స్వాధీనం చేస్తున్నారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. మల్కాపురం పోలీసుల సహాయంతో ఆ ఇంటిని సీజ్ చేశారు. ఈ కేసులో బుధవారం ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మిగిలిన ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పది కిలోల హాష్ ఆయిల్ పట్టివేత

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని గవర జగ్గయ్యపాలెంలో నిల్వ ఉంచిన హాష్ ఆయిల్(లిక్విడ్ గంజాయి)ను పెందుర్తి పోలీసులు, నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం భీమలాపల్లికి చెందిన ఉలంగి రామన్న, పాడేరుకు చెందిన కూడా రవి శంకర్, జీకే వీధి మండలం వంచుల చీరపల్లి గ్రామానికి చెందిన బోనంగి చంటిబాబులు కలిసి హాష్ ఆయిల్ సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో ఏజెన్సీ నుంచి నగరానికి 10 కిలోల హాష్ ఆయిల్‌ను తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి పెందుర్తి పోలీసులు పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.